క్లుప్తంగా

నిధులు మంజూరు కాగానే బ్రిడ్జి నిర్మిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం బొడిచర్ల, నాగులవరం గ్రామాల మధ్య గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు 7.27 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుండ్లకమ్మ చప్టాపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్న వైనంపై మంగళవారం 'వానొస్తే ఆగిపోవాల్సిందే' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వేములకోట, కుంట మధ్య ఉన్న ఉప్పువాగు పరిధి పంచాయతీరాజ్ శాఖకు చెందినదన్నారు. ప్రస్తుతం రూ.7.27 కోట్లతో అంచనాలు పంపామని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

గ్యాస్ ఐడీతో ఫోన్ నంబర్ అనుసంధానించుకోవాలి

పొదిలి: ఆయిల్ కంపెనీల ఆదేశానుసారం వినియోగదారులు గ్యాస్ ఐడీకి తమ మొబైల్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని స్థానిక కరుణా ఇండేన్ గ్యాస్ నిర్వాహకుడు సాయి రాజేశ్వరరావు తెలిపారు. డెలివరీ బాయ్‌కి ఓటీపీ నంబర్ చెబితేనే సిలిండర్ అందజేస్తారని స్పష్టం చేశారు. ఉచిత సిలిండర్లు, సబ్సిడీ పొందడానికి ఈ కేవైసీ, బేసిక్ సేఫ్టీ చెక్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. గడువు ముగిసిన హోస్ పైపును డెలివరీ బాయ్‌ని సంప్రదించి తగిన ధర చెల్లించి మార్చుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గిద్దలూరు రూరల్: ఆటో.. బైక్ ఢీకొని దంపతులు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం .. రాచర్ల మండలం ఫారానికి చెందిన రాజు అనే వ్యక్తి అతడి భార్యతో కలిసి బైక్‌పై గిద్దలూరు వైపు వస్తున్న సమయంలో నంద్యాల వైపుగా వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో రాజుకు, అతడి భార్యకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స కోసం ఏరియా వైద్యశాలకు తరలించారు.

పింఛన్ల పంపిణీ 99 శాతం పూర్తి



పింఛను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ చందన

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం తిప్పాయిపాలెం గ్రామంలో లబ్ధిదారులకు రెండో రోజు మంగళవారం ఎంపీడీఓ తోట చందన పింఛన్లు అందజేశారు. మండలంలో మొత్తం 7,116 మందికిగాను 7043 పింఛన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఆదిమూలపు వినయ్‌తేజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల ఆందోళన



బైఠాయించిన స్వచ్ఛ భారత్ కార్మికులు

కొమరోలు: మండల కేంద్రం కొమరోలులోని గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ ఉద్యోగులకు కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడంతో మంగళవారం గ్రామ సచివాలయం ముందు వారు ఆందోళనకు దిగారు. మూడేళ్ల నుంచి స్వచ్ఛ భారత్ కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, సంబంధిత అధికారులు, సర్పంచ్‌కి మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించే వరకు తాము విధులకు హాజరు కామని కార్మికులు స్పష్టం చేశారు.

నేరుగా కలిసి పనులు చేయించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుజాత

దర్శి: ప్రజలకు ఎటువంటి అవసరాలు ఉన్నా నేరుగా రెవెన్యూ కార్యాలయంలో తనను కలిసి పనులు చేయించుకోవచ్చని తహసీల్దార్ జి.సుజాత సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హడావుడి ఉండటంతో ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేక పోయామన్నారు. ప్రజలు పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదని, వెంటనే తమ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. వీఆర్వోలు అర్జీదారులను తిప్పుకోకుండా వచ్చిన వెంటనే పనులు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇస్తే ఖాళీ చేస్తాం



నిర్వాసితుల కాలనీల్లో పర్యటిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, అధికారులు



నిర్వాసితుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత చెన్నారెడ్డి

- కలెక్టర్‌కు స్పష్టం చేసిన గొట్టిపడియ వాసులు
- నిర్వాసితులను నిర్ధారించేందుకు గడువు పెంచాలని విజ్ఞప్తి
- నిర్మాణంలో ఉన్న ఇన్‌టెక్ వెల్‌ను పరిశీలించిన కలెక్టర్

మార్కాపురం రూరల్: వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల కాలనీల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఉదయం సుడిగాలి పర్యటన చేశారు. వేములకోట వద్ద గల నిర్వాసితుల కాలనీని పరిశీలించారు. అనంతరం గొట్టిపడియ డ్యామ్ గ్యాప్‌ను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముంపు గ్రామమైన కలనూతల ప్రజలతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు గ్రామంలో తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్‌తో మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టు వల్ల తాము నిర్వాసితులమవుతున్నామని, తమకు పరిహారం అందిస్తే గ్రామాన్ని ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నిర్వాసితులను గుర్తించేందుకు చివరి తేదీని పెంచాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తదనంతరం వెలుగొండ ప్రాజెక్టు నుంచి నీటిని పంపిణీ చేసేందుకు నూతనంగా నిర్మిస్తున్న ఇన్‌టెక్ వెల్ పనులను కలెక్టర్ పరిశీలించారు.

ఆర్‌ఆర్ ప్యాకేజీ వెంటనే చెల్లించాలి

వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామమైన గొట్టిపడియ నిర్వాసితులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఆర్‌ఆర్ ప్యాకేజీని వెంటనే చెల్లించాలని కోరారు. ఈ మేరకు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు వేల్పుల చెన్నారెడ్డి వినతిపత్రం అందజేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు మరమ్మతులు చేసేందుకు రెండు రోజుల సమయం తీసుకుంటున్నారని, చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, సూపరింటెండెంట్ ఇంజినీర్ మర్దన్‌ఆలీ, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఝాన్సీ లక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నాగజ్యోతి, సత్యనారాయణ, డీఎల్‌డీఓ సాయికుమార్, మార్కాపురం ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ తోట చందన, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జ్యోతి సృజన, తుమ్మా వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులు కౌలుకార్డులు తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: మండలంలోని కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 2500 మంది రైతులు కౌలుకు పొలం తీసుకుని సాగు చేస్తున్నారని చెప్పారు. వారంతా గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలు గుర్తింపు కార్డు పొందాలని కోరారు. కౌలు కార్డులతో పంట నమోదు, పంట ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం, పంట కొనుగోలు వంటి ప్రయోజనాలు పొందవచ్చని ఆయన తెలిపారు.

కొమరోలు: కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రాజశ్రీ తెలిపారు. మండలంలో పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులు గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి కౌలు కార్డులు తీసుకోవాలని సూచించారు. కౌలు కార్డుల కోసం భూయజమాని ఆధార్‌కార్డు, పొలం పాస్‌పుస్తకం, కౌలు రైతు ఆధార్ కార్డు, కౌలు అగ్రిమెంటు, పాస్ ఫొటో తీసుకుని సంప్రదించాలన్నారు.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా రవీంద్రబాబు



రవీంద్రబాబును సత్కరిస్తున్న నాయకులు

పొదిలి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల శాఖ అధ్యక్షుడిగా పందిటి రవీంద్రబాబు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా వేల్పుల సురేష్, జుటికే రాహుల్‌దేవ్, జిల్లా సభ్యులుగా నేలపాటి రాజును నియమించారు. మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పందిటి కాశీరావు ఆధ్వర్యంలో మండల కమిటీలను నియమిస్తున్నారు. ఈ క్రమంలో పొదిలి కమిటీని ఏర్పాటు చేసినట్లు కాశీరావు తెలిపారు. జూలై 7వ తేదీన సమితి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. మహాజన సోషలిస్టు(ఎంఎస్పీ) కార్యవర్గ సభ్యులుగా ఆదిమూలపు రవి, గంగవరపు నాగులు, యర్రగుంట్ల విజయ్‌ను నియమించారు. వీరిని సమితి నాయకులు అభినందించారు. కార్యక్రమంలో సమితి సీనియర్ నాయకులు వేల్పుల నెహెమ్యా, మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గురజాల బాబూరావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పాఠశాలల్లోనే ఉండాలి



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

త్రిపురాంతకం: విద్యార్థులందరినీ పాఠశాలలకు పంపి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ కె.తులసిమల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. మండలంలోని గణపవరంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విద్యార్థులను పాఠశాలలకు పంపాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలకు రాని విద్యార్థులందరినీ ముందుగా గుర్తించాలన్నారు. విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గించాలని సూచించారు. పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రోశమ్మ, సీఆర్పీ దానీబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. గొల్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖరరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ వెంకట తిరుమలయ్య, హెచ్ఎం దీప్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి కోసం వేట

మార్కాపురం: మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామంలో ఈనెల 1న వృద్ధురాలు కన్నెసాని నారాయణమ్మ హత్య కేసులో నిందితుడైన శ్రీనును అరెస్టు చేసేందుకు మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. మార్కాపురం పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్‌తో పాటు మరో ఇద్దరు ఎస్సైలు రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, వినుకొండ, నర్సరావుపేట, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో నిందితుడి కోసం గాలిస్తున్నారు. వేములకోటకు చెందిన నారాయణమ్మ తన కుమార్తె సునీతను 16 ఏళ్ల క్రిందట యర్రగొండపాలెం మండలం యల్లారెడ్డిపల్లికి చెందిన రేళ్ల శ్రీనుకు ఇచ్చి వివాహం చేశారు. అయితే శ్రీను భార్యపై అనుమానంతో 2023 మార్చి 14న గొడ్డలితో నరికి చంపాడు. ఈ కేసులో అరెస్ట్ అయి ఇటీవలే బయటకు వచ్చాడు. తనను జైల్లో పెట్టించిందనే కోపంతో అత్త నారాయణమ్మను కూడా జూలై 1వ తేదీన నరికి చంపాడు. శ్రీనును అరెస్టు చేసేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఒంగోలు క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో నిందితుని కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. భార్యను, అత్తను చంపిన నిందితుడు శ్రీనను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజ్ చేసిన భవనం కూల్చివేత



కూల్చేందుకు ప్రయత్నించిన భవనం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశినాయన కుంటలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని నగర పంచాయతీ అధికారులు సీజ్ చేయడంతో ఆక్రమణదారుడు శివరంగారెడ్డి కూల్చేందుకు ప్రయత్నించిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం.. కాశినాయకుంటలో శివరంగారెడ్డి కాశినాయన ఆలయం పక్కనే మూడు అంతస్తుల భవనం నిర్మించాడు. కుంటలో అక్రమ కట్టడం నిర్మించాడంటూ జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు నగర పంచాయతీ వారు భవనాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన భవనాన్ని ఆక్రమించిన సదరు వ్యక్తి శివరంగారెడ్డి ఇటాచీ వాహనంతో కూల్చేందుకు ప్రయత్నించాడు. దీంతో సమాచారం అందుకున్న నగర పంచాయతీ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని శివరంగారెడ్డితో పాటు అతడి కుమారుని అదుపులోకి తీసకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డాక్టర్లకు సన్మానం



డాక్టర్స్‌ను సన్మానిస్తున్న యోగా టీచర్, చైర్మన్‌లు

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండం పీహెచ్‌సీలో డాక్టర్స్‌ను ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎన్ నారాయణరెడ్డి మంగళవారం సన్మానించారు. డాక్టర్స్‌డే సందర్భంగా డాక్టర్ కడప వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ వికాష్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సమాజంలో వైద్య వృత్తి మహోన్నతమైందని, డాక్టర్స్ రోగులపాలిట దేవుడని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మోక్షగుండం ముక్తీశ్వరక్షేత్రం చైర్మన్ ఆవుల కోటేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం



గోమాతకు సీమంతం చేస్తున్న కాలనీ వాసులు

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లోని నక్కా వెంగయ్య హౌసింగ్ కాలనీలో గోమాతకు సీమంతం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇమ్మడి గిరిబాబు పెంచుకుంటున్న గోమాతకు కాలనీలో శ్రీమంతం ఏర్పాటు చేశారు. కాలనీ వాసులు పసుపు, కుంకుమ, చీరలు పెట్టి అంక్షింతలు వేసి వైభవంగా సీమంతం చేశారు. అందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

అమల్లోకి నూతన చట్టాలు



మాట్లాడుతున్న ఎస్సై నరసింహారావు

బేస్తవారిపేట: నూతన క్రిమినల్ చట్టాలు జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు ఎస్సై నరసింహారావు అన్నారు. మంగళవారం మండలంలోని జెన్నివారిపల్లెలో నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించి గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. కొత్త చట్టం ప్రకారం ఫిర్యాదుల నుంచి సమన్ల దాకా అన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయని వివరించారు.

ట్యాంకర్ల ఏర్పాటులో గందరగోళాన్ని నివారించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రమేష్

పెద్దారవీడు: ట్యాంకర్ల ఏర్పాటులో గందరగోళాన్ని నివారించాలని సుంకేసుల సర్పంచ్ గుడ్డెపోగు రమేష్.. కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వెలుగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీలను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్‌ను ఆయన కలిసి పలు సమస్యలపై అర్జీ అందజేశారు. గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా అనేక వ్యయ ప్రయాసలకోర్చి నీటి సమస్యను తీర్చుతున్నామన్నారు. దీని కోసం అప్పులు చేసి ఆర్థికంగా చితికి పోయామని ఆయన కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 16 నెలల నుంచి ట్యాంకర్ల బిల్లులు రావాల్సి ఉందని విన్నవించుకున్నారు. యేర్వ సహదేవుడు, సానికొమ్ము పుల్లారెడ్డి, గుర్రం ముత్యాలయ్య, తంగిరాల పెద్ద పాపయ్య, గుడ్డెపోగు కొండయ్య, తంగిరాల దేవయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

కంభం: నూతన చట్టాలపై విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఎస్సై పులి రాజేష్ అన్నారు. మంగళవారం మండలంలోని రావిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా అమల్లోకి వచ్చిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య బిల్ మూడు కొత్త క్రిమినల్ చట్టాలు జూలై ఒకటి నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపారు. కొత్తచట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

పొదిలి: నగర పంచాయతీలోని నవాబ్‌మిట్టలో షేక్.అర్షియా మృతి చెందారు. పేద కుటుంబం కావడంతో మానవత సంస్థ, చిన్ననాటి స్నేహితుల బృందం ఆధ్వర్యంలో అంత్యక్రియలకు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. అర్షియా మృతదేహాన్ని సందర్శించిన సభ్యులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.11 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ డైరెక్టర్ కాటూరి పెద్దబాబు, కన్వీనర్ కె.యల్లమందారెడ్డి, తానికొండ వెంకటరావు, బండి అశోక్, సామంతపూడి నాగేశ్వరరావు, షేక్.బాజీ కరీముల్లా, షేక్.మహ్మద్ రఫీ, షేక్.రసూల్, షేక్.యాసిన్, షేక్.యస్దాని(రోటి), డాక్టర్ నారాయణ పాల్గొన్నారు.

ప్రధాన రహదారి బురదమయం



బురదమయంగా మారిన ప్రధాన రహదారి

పొదిలి: పట్టణంలోని ఒంగోలు–కర్నూలు రహదారిలో వర్షం కురిస్తే భారీగా నీరు నిల్వ చేరడంతోపాటు బురదమయంగా మారుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పశ్చిమ ప్రాంతాన్ని కలిపే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరో వైపు పట్టణంలోని ప్రధాన రహదారి కూడా కావడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు వందల సంఖ్యలో ఉంటాయి. బురద పేరుకుపోవడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఎక్కడ జారిపడతామేమోనని ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం మొత్తం ఇదే సమస్య వెంటాడుతోంది. దుకాణదారుల అవస్థలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లు అభివృద్ధి చేయడంతోపాటు, సైడు కాలువలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కొమరోలు: విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని మండల విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని సర్విరెడ్డిపల్లెలో బడికి పోదాం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో పురవీధుల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాకానుక కిట్లు ఉచితంగా అందిస్తారని, మధ్యాహ్నం పోషకాహారాలతో కూడిన భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉభయదాతలకు సన్మానం



ఉభయదాతలను సన్మానిస్తున్న యక్కలి

పొదిలి: స్థానిక శ్రీశ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయానికి, పూజలకు విరాళాలు అందించిన ఉభయదాతలను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముందుగా అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, నారాయణం మురళీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఉభయదాతలు ప్రత్యేక పూజలు చేశారు. గోత్రనామాల పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. శనగపల్లి నాగేశ్వరరావు, ఆకుపాటి వెంకయ్య, గొంట్లా శ్రీనివాసరావు, పైడిమర్రి నారాయణ, మేడా నరసింహారావుతోపాటు నెల్లూరు జిల్లా సుళ్లూరుపేట నుంచి వచ్చిన ఉభయదాతలను సన్మానించారు. కార్యక్రమంలో పొనుగపాటి కోటేశ్వరరావు, పి.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.